# <u>పత్రికా ప్రకటన</u>

**తేది.23.12.2017.**

## <u>కేబుల్ మెకానిక్ వేషదారణలో దొంగతనాలు చేస్తున్న ఘరానా నేరస్థుడి అరెస్ట్</u>

***మొత్తం సుమారు రూ.4 లక్షలు విలువ చేసే సొత్తు స్వాధీనం***

కేబుల్ ఆపరేటర్ ముసుగులో మహిళలు మరియు వృద్ధులను పరిచయం చేసుకుని, వారిని మాటల్లో పెట్టి , వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు ఒకసారి చూసి ఇస్తానని నమ్మించి, బాధితులు ఏమరుపాటుగా ఉన్న సమయంలో బంగారంతో ఉడాయించే **బాణావత్ బాబు నాయక్ అలియాస్ సామ్యూల్** అనే ఘరానా నేరస్థుడిని ది.22.12.17న సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా వలపన్ని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి సుమారు **<u>రూ.4 లక్షల విలువ చేసే 376 గ్రాముల బంగారం, నగదు మరియు ఎల్.ఇ.డి టివిని స్వాధీనం చేసుకోవడం జరిగింది.</u>**

విజయవాడ, యనమలకుదురుకు చెందిన బాణావత్ బాబు నాయక్ అలియాస్ శ్యామ్యుల్ (21) చిన్నతనం నుండి జల్సాలకు అలవాటుపడి క్రొత్త తరహా పద్ధతిలో నేరాలను చేయడం ప్రారంభించాడు. నిందితుడు వంటిపై బంగారు ఆభరణాలు ధరించి ధనవంతుడిగా వేషధారణ కట్టి విజయవాడ పరిసర ప్రాంతాలలో మోటారు బైక్‌పై సంచరిస్తూ నేరం చేసే ప్రదేశాలను ఎంచుకుంటాడు. చేతిలో కేబుల్ వైరు పట్టుకుని ముందుగా ఒక ఇంట్లోకి ప్రవేశించి, వారికి తాను కేబుల్ వైర్లను భిగించే ఆపరేటర్‌గా చెబుతాడు. ఆ ఇంట్లోని యజమానులు లోపలకు వెళ్ళగానే సంబంధింత ఇంటి వెనుకవైపుకు వెళ్ళి ప్రహరీగోడపై నుండి ఆ ఇంటిని ఆనుకుని ఉన్న మరో ఇంట్లోని వారిని బయటకు పిలుస్తాడు. బయటకు వచ్చిన మహిళలు మరియు వృద్ధులతో బాగా పరిచయం ఉన్న వ్యక్తిలా అక్క, ఆంటీ, మామ్మ అని వరుసలతో బంధుత్వం కలిపి వారిని మాటల్లోకి దించుతాడు. బాధితులు ధరించిన బంగారు ఆభరణాలు చాలా బాగున్నాయని, మా అక్క మీరు వేసుకున్న గొలుసు ఇమ్మంది అలాంటి మోడల్ గొలుసు చేయించుకుంటుందని వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు మరియు పెద్ద కరెన్సీ నోట్లకు చిల్లర ఇస్తానని రూ.2 వేల కరెన్సీ నోట్లను తీసుకుని, బాధితులు ఏమరుపాటుగా ఉండే సమయాన్ని ఆసరాగా తీసుకుని అక్కడి నుండి క్షణాల్లో పారిపోతాడు.

ఈ నేపథ్యంలో నిందితుడు బాబునాయక్ పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో-7, మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో-4, సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో-2, పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో-2, ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో-1 మరియు గన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 మొత్తం 17 నేరాలకు పాల్పడ్డాడు.

విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో వివిధ నేరాలను అరికట్టి నిందితులను పట్టుకునేందుకు పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారి ఆదేశాలపై సిసిఎస్ పోలీసులు నగరంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ది.23.12.2017న వన్‌టౌన్ శివాలయం వీధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బాబునాయక్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి సుమారు **<u>రూ.4 లక్షల విలువ చేసే 376 గ్రాముల బంగారం, నగదు మరియు ఎల్.ఇ.డి టివిని స్వాధీనం చేసుకోవడం జరిగింది.</u>**

-- xx --